# ప్రేమాయణం



కోర్టులో చాలా విచిత్రమైన కేసు విచారణకు వచ్చింది.

'మిస్ అనిత' అనే వనిత- నలుగురు ప్రేమికులకి జోరుగా ప్రేమలేఖలు రాయసాగింది. నలుగురూ ఆమెను గాఢంగా ప్రేమించారు. అడపాదడపా అనుకున్న చోట్ల కలుసుకుంటూండేవాళ్ళు. ఆమెని వివాహమామాడాలని కూడా నిశ్చయించుకున్నారు.

ఆ నలుగురిలో ప్రతి ఒక్కరూ తానే ఆమెకి ఏకైక ప్రియుడినని భావించుకొనేవారు. అయితే... 'పెళ్ళి' ప్రసక్తి వచ్చేసరికి మాత్రం సరిపడదు. ఎంతో నేర్పుగా, గుట్టుగా, రట్టు కాకుండా ఆమె ఆ నలుగురితోనూ ఆమె వ్యవహారం నడుపుతూ వచ్చింది.

అయితే... ఒకసారి పొరపాటున 'ప్రేమలేఖలు' తారుమారు కావడంతో, తీగ లాగితే డొంక అంతా కదిలినట్లు- మొత్తం ప్రేమాయణమంతా బయటపడింది.

ఆమె ప్రవర్తన మూలంగా తమ పరువు పోయిందనీ, ఎంతో మానసిక వ్యధకు గురి కావలసి వచ్చిందనీ, అందువల్ల తమకు నష్టపరిహారం కావాలంటూ నలుగురూ కోర్టుకెక్కారు.

ఈ వింత కేసు ఊరూవాడా ఎంతో సంచలనం కలిగించింది.

కేసు వివరాలు విన్న జడ్జీగారు ఆశ్చర్యపోయి ముక్కుమీద వేలేసుకున్నారు.

నలుగురి మనసులు రంజింపజేసిన ఆ ప్రేమలేఖల స్వరూపం చూడాలనుకున్నారు. వెంటనే వాటిని తెప్పించి చదివారు. అవి ఎంతో అద్భుతంగా ఉన్నాయి.

'ప్రేమలేఖలంటే ఇలావుండాలి. హు- మా ఆవిడా ఉంది ఎందుకూ... ఒక్కసారైనా ఇటువంటి ఉత్తరం ఒక్కటైనా రాసిందా?' అని మనసులోనే వేడి నిట్టూర్పు విడిచారు.

కోర్టు జనంతో కిటకిటలాడుతోంది.

అభియోగం మోపబడిన అనిత అనబడే ఆ అమ్మాయిని కోర్టులో హాజరు పరిచారు. నెత్తిమీద మేలిముసుగుతో తలవంచుకుని ఆమె జనంలోకి ప్రవేశించింది.

ప్రమాణం చేయడం పూర్తిఅయింది. ఆమె ముఖం జడ్జిగారికి సరిగా కనిపించడం లేదు. అంతటి ప్రేమపట్టు గల ఆమె ముఖారవిందం చూడాలన్న ఉత్కంఠ ప్రబలింది ఆయనలో.

"నీ పేరేమిటి?" అని గట్టిగా అడిగారు జడ్జిగారు.

అప్రయత్నంగా ఆమె జడ్జిగారి వంక తిరిగి "లిల్లీ..!" అంది.

ఆమెవంక చూస్తూనే జడ్జిగారు కొయ్యబారిపోయారు. ఆ వెంటనే కళ్లు తిరిగి పడిపోయారు. అపస్మారక స్థితిలో ఉన్న జడ్జిగారు కలవరించసాగారు-

"ఎంత పని చేశావు లిల్లీ... నువ్వేనా అనితవి? సరే ఫో... నీ ఇష్టం వచ్చిన చోటికే ఫో... నీకు విడాకులు ఇచ్చేస్తాను!" అంటూ.

- *ఉదయం వార పత్రిక... 26 మార్చి-2 ఏప్రిల్ ' 87*